ధాన్యం సొమ్ములేవి బాబూ?

- కృష్ణాజిల్లాలో రూ.12.08 కోట్ల బకాయి
- లక్ష్యాన్ని చేరని ధాన్యం సేకరణ
- సేకరించిన ధాన్యం సొమ్ముకోసం అన్నదాతల ఎదురుచూపు
- ఖరీఫ్ సాగు మరింత భారం

అప్పల కోసం అన్నదాతల తిప్పలు



రబీ సీజన్ ధాన్యం సంచుల్లో నింపుతున్న కూలీలు (ఫైల్)

కంకిపాడు: ధాన్యం సేకరించిన 48 గంటల్లో ధాన్యం సొమ్ము రైతు ఖాతాకు జమ అవుతుందని కూటమి ప్రభుత్వం చేసిన ప్రచారం కేవలం ప్రచారార్భాటంగానే మిగిలింది. ధాన్యం సేకరణ పూర్తయి నెల రోజులు కావస్తున్నా వందలాది మంది రైతులు ధాన్యం సొమ్ములు అందక అవస్థలు పడుతున్నారు. మరో వైపు ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తోంది. పొలాలు అదును తప్పక ముందే వరి నాట్లు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు. అయితే సాగుకు అవసరమైన పెట్టుబడులకు నానా పాట్లు పడుతున్నారు. చేతిలో చిల్లిగవ్వ లేక అప్పుల కోసం పరుగులు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది.

లక్ష్యాన్ని చేరని ధాన్యం సేకరణ

కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 1.51 లక్షల హెక్టార్లలో, రబీ సీజన్‌లో 12,285 ఎకరాల్లో వరి సాగు జరిగింది. ఖరీఫ్ సాగులో మిగులు ధాన్యం సేకరణతో పాటు రబీ సీజన్‌కు 75 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సివిల్ సప్లయిస్ అధికారులు జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేపట్టారు. 8570 మంది రైతుల నుంచి రూ 127.97 కోట్లు విలువైన 54,304.34 మెట్రిక్ టన్నులు మాత్రమే ధాన్యం సేకరించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోలేక పోవటంలో కూటమి సర్కారు నిర్లక్ష్యంతో పాటుగా అధికారుల అలసత్వం కూడా అధికంగా ఉంది.

దళారులు, మిల్లర్లు ఏకమయ్యారు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దళారీ వ్యవస్థకు ఆస్కారం లేకుండా రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేసేలా సమర్థంగా చర్యలు తీసుకుంది. ధాన్యం సేకరణ నుంచి మిల్లుకు తరలించే వరకూ ఎలాంటి అవరోధాలు తలెత్తకుండా సమర్థంగా వ్యవహరించింది. ప్రకృతి విపత్తును సైతం ఖాతరు చేయకుండా ధాన్యం సేకరించి రైతుకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంది. దీనికి పూర్తి భిన్నంగా కూటమి సర్కారు వ్యవహరించిందంటూ అన్నదాతలు వాపోని రోజు లేదు. రబీతో పాటు ఖరీఫ్ మిగులు ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యం నిర్దేశించుకున్నా ఆచరణలో మాత్రం లక్ష్యం చేరలేకపోయింది. రవాణా వాహనాలను సమకూర్చటంలో జాప్యం జరిగింది. ఆఖరికి గోనె సంచుల కొరత రైతులను వెంటాడింది. చివరికి ప్రభుత్వం ఏర్పాటుచేసిన రైతు సేవా కేంద్రాలకు కాకుండా దళారులకు 75 కిలోలు బస్తా రూ.1400కే తెగనమ్ముకుని సొమ్ము చేసుకున్న పరిస్థితులు ఈ సీజన్‌లో జిల్లాలో చోటుచేసుకున్నాయి. మరో వైపు దళారులకు మిల్లర్లు తోడై సహకారాన్ని అందించటంతో రవాణా వాహనాలు, సంచులు దళారులకే ముందుగా చేరుకోవటంతో రైతులు దళారులకే పంటను అమ్ముకోవాల్సి వచ్చింది.

బకాయి సొమ్ముల కోసం ఎదురుచూపులు

ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల ఖాతాలకు సొమ్ము జమ చేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. ధాన్యం సేకరణ తొలి నాళ్లలో సొమ్ము బాగానే జమయింది. ప్రస్తుతం ధాన్యం సేకరణ నిలిచింది. అయితే సుమారు నెల రోజులకు పైగా ధాన్యం సొమ్ముల కోసం జిల్లాలో రైతులు ఎదురుచూపులు చూస్తున్నారు. రబీలో 8570 మంది రైతుల నుంచి రూ.127.97 కోట్ల విలువైన ధాన్యం సేకరించారు. 7308 మంది రైతులకు రూ.115.14 కోట్లు జమ చేశారు. కానీ ఇంకా 767 మంది రైతులకు రూ.12.08 కోట్లు అందాల్సి ఉంది. నెల రోజులకుపైగా ఆ రైతులు అధికారుల చుట్టూ, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



పునాదిపాడులో నాట్లకు సిద్ధం చేస్తున్న పొలం

రైతులను ఖూనీ చేస్తున్న సర్కారు



రైతులను కూటమి సర్కారు ఖూనీ చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యికోట్లకు పైగా ధాన్యం సొమ్ము బకాయిలు ఉన్నాయి. ధాన్యం సొమ్ము ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేయటం అన్యాయం. ఖరీఫ్ సాగుకు పెట్టుబడులు సమకూర్చుకోవటానికి రైతులు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఏడాది లోపు అప్పులు చెల్లిస్తే సున్నా వడ్డీ వర్తిస్తుంది. ప్రభుత్వ అలసత్వం వల్ల సొమ్ములు అందక రుణాలు చెల్లించే స్థితి లేదు. రైతులకు జరుగుతున్న నష్టానికి ప్రభుత్వం బాధ్యత వహించాలి. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారుల తీరు సరిగా లేదు.

–మాగంటి హరిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ కౌలురైతు సంఘం

ఖరీఫ్‌లో అప్పల తిప్పలు

ఓ వైపు ధాన్యం సొమ్ము అందక ఇబ్బందులు పడుతూ మరో వైపు ఖరీఫ్ సాగు ముంచుకొస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. సాగు ఆలస్యం అయితే పొలాలు అదును తప్పుతాయనే భయం వెంటాడుతోంది. గతంలో సాగు ఆరంభానికి ముందే పెట్టుబడి సాయం అందేది. అలాంటిది ఈ ప్రభుత్వంలో వరుసగా రెండో ఏడాది కూడా పెట్టుబడి సాయం అందలేదు. దీంతో పంట పెట్టుబడుల కోసం అందినకాడికి అప్పులు సమకూర్చుకుని సాగు పనుల్లో నిమగ్నమవుతున్నారు.

ట్రాఫిక్ పోలీసులకు బైక్‌లు అందజేత

పెనమలూరు: తాడిగడప జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో మండల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులకు నాలుగు బైక్‌లను డీఎస్పీ సీహెచ్.శ్రీనివాసరావు శనివారం అందజేశారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరించటానికి, ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. ట్రాఫిక్ పోలీసులకు బైక్‌లు ఇవ్వటం వలన ప్రమాదాల సమయంలో సైరన్‌తో వెంటనే స్పాట్‌కు చేరుకోగలుగుతారని అన్నారు. ట్రాఫిక్ గస్తీలో ఉన్న సమయంలో రూల్స్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటారని తెలిపారు. ట్రాఫిక్ జామ్ అయినా వెంటనే పోలీసులు బైక్‌లపై ఘటనా స్థలానికి చేరుకొని చర్యలు తీసుకుంటారని వివరించారు. ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసులకు బైక్‌లు ఇవ్వటం వలన పెనమలూరు పరిధిలో విధులు సక్రమంగా నిర్వహించటానికి అవకాశం ఉంటుందన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు, ప్రమాదాల నివారణకు వాహన దారులు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



నూతన బైక్‌లు సిబ్బందికి అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళలు మార్చాలి

కంకిపాడు: వ్యవసాయ విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేయాలని రైతులు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు విన్నవించారు. మండలంలోని కోమటి గుంట లాకులు ప్రధాన రహదారికి రూ.35 లక్షలు నిధులు మంజూరు కావటంతో అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఎమ్మెల్యేను కలిశారు. ఉదయం 6 గంటల నుంచి వ్యవసాయ విద్యుత్ నిరంతరాయంగా సరఫరా చేయాలని కోరారు. ఖరీఫ్ సాగు పనులకు వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పులు ఉపకరిస్తాయని విజ్ఞప్తి చేశారు. అధికారులతో సంప్రదించి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో ఇప్పటికే రూ.76 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, వెలగపూడి శంకర్‌బాబు, సుదిమళ్ల రవీంద్ర, చిట్టూరి నాగేశ్వరరావు, యార్లగడ్డ రాజా, మేకల నాగేశ్వరరావు, పులి కామేశ్వరరావు, ఎంపీడీఓ పి.అనూష, అధికారులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కానూరు గుంతల రోడ్డుపై ట్రాఫిక్ జామ్

పెనమలూరు: కానూరు ప్రధాన రహదారి గుంతలమయంగా మారటంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. గత కొద్దిరోజుల క్రితం కానూరు ప్రధాన రహదారి కొంత నిర్మాణం చేసి, మరి కొంత ప్యాచ్‌వర్కు చేశారు. అయితే పనులు తూతూ మంత్రంగా జరగటంతో కొద్దిపాటి వర్షానికే రోడ్డు గుంతల మయంగా మారింది. కాగా ప్రస్తుతం రోడ్డుపై వాహనాల రాక పోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. గ్రామంలో శనివారం సాయంత్రం రోడ్డుపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. రోడ్డుపై గుంతల కారణంగా వాహనాల రాకపోకలకు ఇబ్బంది తలెత్తడంటతో ట్రాఫిక్ బారులు తీరి నిలిచిపోయింది. వాహనదారులు నానా ఇబ్బందులు పడినా పోలీసులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. చాలా సమయం ట్రాఫిక్ నిలిచి పోవటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా తాడిగడప మున్సిపాలిటీ అధికారులు స్పందించి కానూరు ప్రధాన రహదారిని మరమ్మతులు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. గుంతలు లేని రోడ్లు నిర్మిస్తామని కూటమి పాలకులు చెప్పినా ఆచరణలో మాత్రం గుంతల రోడ్లే దర్శనమిస్తున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు.



కానూరు ప్రధాన రహదారిలో గుంతల కారణంగా నిలిచిన ట్రాఫిక్

రూ.53 కోట్లతో కొత్త విద్యుత్ లైన్లు

హనుమాన్‌జంక్షన్ రూరల్: గన్నవరం నియోజకవర్గంలో 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బాపులపాడు మండలం కానుమోలులోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రూ.2.30 కోట్ల వ్యయంతో తలపెట్టిన పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. తేలప్రోలు, వీరవల్లి 33 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కొత్త లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు యార్లగడ్డ చెప్పారు. అనంతరం మల్లవల్లిలో 24 గంటల విద్యుత్ సరఫరా కోసం రూ.3.50 కోట్ల వ్యయంతో తలపెట్టిన పనులకు ఆయన లాంఛనంగా ప్రారంభించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటికే పలుచోట్ల కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయని యార్లగడ్డ తెలిపారు. సుమారు రూ.53 కోట్ల వ్యయంతో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఏపీ సీపీడీసీఎల్ ఎస్ఈ సత్యానంద్, హనుమాన్‌జంక్షన్ ఏడీ ఎ.శ్రీనివాసరావు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కొత్త విద్యుత్ లైన్ల పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

ఎమ్మార్పీఎస్ సమావేశం

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాదలో శనివారం ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మ నిర్మాణం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు నిర్ణయించారు. సమావేశంలో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదురుగా ఈ దిమ్మ నిర్మించాలని తీర్మానించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి మంద వేణు, గ్రామ అధ్యక్షుడు దువ్వూరి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు నందేటి రాజేష్, చోడ వరపు వెంకటేశ్వరరావు, నందేటి బాబూరావు, ఉయ్యూరు కాంతారావు, నందేటి రంగారావు పాల్గొన్నారు.

అధ్వానంగా మల్లవల్లి బీసీ కాలనీ రోడ్లు



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలోని బీసీ కాలనీలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కాలనీ ప్రధాన రహదారి కొద్దిపాటి వర్షానికే బురదకయ్యగా మారుతోంది. కాలనీలోని ఇతర రోడ్ల దుస్థితి కూడా దారుణంగా ఉంది. ఈ రోడ్లపై రాకపోకలు సాగించేందుకు స్థానికులు నానాపాట్లు పడుతున్నారు. కాలు తీసి కాలు వేయటానికి కూడా కాలనీ ప్రధాన రహదారిపై ఆస్కారం లేకుండా ఉంది. గుంతలు, బురదమయంగా ఉన్న రోడ్డుపై ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. ఈ రహదారిపై వాహనాదారుల ప్రయాణం సర్కస్ ఫీట్లను తలపిస్తోంది. బీసీ కాలనీ ప్రధాన రహదారి ఏపీఐఐసీ పారిశ్రామికవాడకు వెళ్లే వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటుంది. దీనికి తోడు ఈ రోడ్డు నుంచే గ్రామంలోని వ్యవసాయదారుల ట్రాక్టర్లు కూడా అధికంగా ప్రయాణిస్తుంటాయి. దీంతో ఛిద్రంగా మారిన రహదారితో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇక స్థానికుల ఇబ్బందులు వర్ణనాతీతం. చెప్పులు చేతితో పట్టుకుని ఈ రోడ్డుపై నడవాల్సిన దుస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు.

ఆరు బస్సుల్లో బ్యాటరీల చోరీ

కంకిపాడు: ప్రైవేటు కళాశాలల బస్సుల్లోని బ్యాటరీలు చోరీకి గురైన సంఘటన శనివారం కంకిపాడు పట్టణంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం .. పట్టణంలోని పలు ప్రధాన రహదారుల వెంబడి నిత్యం కళాశాలలు, పాఠశాలల బస్సులను నిలిపి ఉంచుతుంటారు. ఈ బస్సులను లక్ష్యంగా చేసుకున్న గుర్తుతెలియని వ్యక్తులు శనివారం తెల్లవారుఝామున ఆరు బస్సుల్లోని విలువైన బ్యాటరీలను చోరీ చేశారు. ఉదయం బస్సుల వద్దకు వెళ్లిన ఆయా బస్సుల డ్రైవర్లు బ్యాటరీలు చోరీకి గురైనట్లు గుర్తించి విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకువెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనలు జరిగిన ప్రదేశాల్లో ఉన్న సీసీ కెమెరాల పుటేజ్‌ను సేకరిస్తున్నారు. ఇటీవల కాలంలో బైక్ చోరీలు, తాజాగా బస్సుల్లో బ్యాటరీలు చోరీకి గురికావటంతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఎస్ఐ డి.సందీప్‌ను వివరణ కోరగా, బస్సుల్లో బ్యాటరీలు చోరీకి గురైన సంఘటనపై వివరాలు సేకరిస్తున్నామన్నారు. సీసీ కెమెరాల పుటేజ్ సేకరించి దర్యాప్తు చేపడుతున్నామని వివరించారు.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అదనపు కట్నం కోసం భర్త, అత్తమామ, ఆడపడుచులు వేధిస్తున్నారంటూ వివాహిత భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. గొల్లపూడి సత్యనారాయణ వీధికి చెందిన నూనె లీలావతికి ప్రదీప్‌తో 2024 ఫిబ్రవరిలో వివాహమైంది. ఆ సమయంలో కట్నం, ఇతర ఖర్చులు కలిపి రూ. 42 లక్షలు ఖర్చయింది. మూడు నెలల పాటు వీరి సంసారం బాగానే సాగింది. ఆ తర్వాత భర్త ప్రదీప్, అత్త పద్మావతి, నరసింహారావు, ఆడపడుచు ప్రత్యూష, ఆమె భర్త శ్రావణ్‌లు లీలావతిని వేధించసాగారు. ఆమెకు అనారోగ్యం ఉందని, పిల్లలు పుట్టరని, మందులు వాడాలంటూ ఒత్తిడి తెచ్చారు. సూటిపోటి మాటలతో వేధిస్తున్నారు. భర్త శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. వేరే సంబంధం చేసుకుంటే అదనంగా కట్నం వచ్చేదని ఆమెను ఇబ్బందులకు గురి చేశారు. ఉద్యోగ రీత్యా కొంత కాలం కిందట హైదరాబాద్ వెళ్లారు. అక్కడా అవే వేధింపులు చేయసాగారు. హైదరాబాద్ వెళుతూ ఈ ఏడాది మార్చి 2న రాయనపాడు రైల్వే స్టేషన్‌లో వదిలివేసి వెళ్లాడు. అప్పటి నుంచి లీలావతి పుట్టింట్లోనే ఉంటుంది. ఈ సమయంలో విడాకుల కావాలని కోర్టు నోటీసులు పంపాడు. భర్త, అత్తమామల వేధింపుల తాళలేక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

స్వయం ఉపాధికి ఫిక్కీ ఫ్లో శిక్షణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): మూగ, బధిర విద్యార్థులు, మహిళలు స్వయం ఉపాధి పొందేలా ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్, సమన కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ చైర్ పర్సన్ అమృత కుమార్ మాట్లాడుతూ మూగ, బధిర మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీలో 3 నెలల శిక్షణ ప్రారంభించామన్నారు. ఫిక్కీ ఫ్లో ఇనిషియేటింగ్ హెడ్ విజయలక్ష్మి మాట్లాడుతూ మూగ, బధిర విద్యార్థులు, మహిళలు టైలరింగ్, ఎంబ్రాయిడరీలో శిక్షణ పొందిన తరువాత స్వయం ఉపాధి పొందవచ్చన్నారు. గూగుల్ స్కెచప్, ఆటో క్యాడ్, ఎంబ్రాయిడరీ, టై అండ్ డై, స్క్రీన్ ప్రింటింగ్ నేర్పిస్తామన్నారు. ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ సీనియర్ వైస్ చైర్మన్ సుప్రియ మల్లినేని, వైస్ చైర్మన్ రజిని చిత్ర, కార్యదర్శి సుమబిందు అట్లూరి, సంయుక్త కార్యదర్శి దీప్తి చలసాని, కోశాధికారులు దేవినేని తులజ భవాని, అనిలా నారియా పాల్గొన్నారు.

క్లుప్తంగా

రెల్లి కాలనీని సందర్శించిన జేసీ



కంకిపాడు: పట్టణంలోని రెల్లికాలనీలో జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ శనివారం పర్యటించారు. రెల్లి కాలనీలో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న 20 మంది నివాసితులకు పట్టాలు మంజూరు చేసేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా రెల్లి కాలనీని సందర్శించి అక్కడి ప్రజలతో మాట్లాడారు. నివాసితుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. రెల్లి కాలనీ పూర్తి రికార్డులను పరిశీలించారు. ఇళ్ల పట్టాలను త్వరితగతిన మంజూరు చేయాలని పలువురు స్థానికులు జేసీకి విజ్ఞప్తి చేశారు. పరిశీలనలో తహసీల్దార్ వీ భావనారాయణ, ఆర్ఐ ఉస్మాన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



గన్నవరం రూరల్: నివాస గృహాల్లో దోమలు పెరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఆత్కూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు సూచించారు. శనివారం గ్రామంలోని గృహాలకు ఆరోగ్య సిబ్బందితో వెళ్లి దోమల నివారణ చర్యలు వివరించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని, నిరంతరం ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. ఏఎన్ఎంలు జె.మంజుల, వి.విమల, ఆశా వర్కర్‌లు దుర్గా, మేరీ తదితరులు పాల్గొన్నారు.

మాణిక్యాలమ్మ తల్లికి ఆషాఢ సారె సమర్పణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం అంపాపురంలోని మాణిక్యాలమ్మ తల్లికి ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గ్రామ మహిళలు సారె సమర్పించారు. మహిళలంతా శనివారం గ్రామ ముఖద్వారం నుంచి కలిసి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. దేవస్థానంలో మాణిక్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి చీర, జాకెట్టు, గాజులు, పసుపు, కుంకుమ, పువ్వులు, స్వీట్లు, పండ్లతో ఆషాఢం సారెను ఘనంగా సమర్పించారు.

బ్యాగులు, పుస్తకాల పంపిణీ



గన్నవరం: పేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని గన్నవరం సర్పంచి నిడమర్తి సౌజన్య పిలుపునిచ్చారు. మండలంలోని దావాజిగూడెం ఎస్సీ కాలనీలో శనివారం ఎంఈఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు దేవరపల్లి ఏసుబాబు ఆధ్వర్యంలో పీఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ పారా రామకృష్ణ 60 మంది పేద విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు తల్లిదండ్రులతో పాటు దాతలు ముందుకురావడం అభినందనీయమన్నారు. ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు విక్టర్‌బాబు, గ్రామ ప్రముఖులు ఎం.ఎస్.చౌదరి, ఎస్.శేషుకుమార్, నిడమర్తి నాగేశ్వరరావు, కొడాలి జోసఫ్ పాల్గొన్నారు.

సెప్టెంబరు 21న జాతీయ స్థాయి తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని సెప్టెంబరు 21వ తేదీన తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జాతీయస్థాయి తెలుగు షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలుగు షార్ట్ ఫిల్మ్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కె.ఎస్.ఎస్.ప్రసాద్ తెలిపారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో శనివారం పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రసాద్ మా ట్లాడుతూ ఈ సంవత్సరం ప్రైవేట్ పాటల వీడియోల పోటీలు, రీల్స్ పోటీలు జరుగుతాయన్నారు. షార్ట్ ఫిల్మ్ పోటీల విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.7 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు, ప్రైవేట్ పాటల వీడియోల పోటీల విజేతలకు మొదటి బహుమతి రూ.5 వేలు, రెండో బహుమతి రూ.3 వేలు, మూడో బహుమతి రూ.2 వేలు, అలాగే రీల్స్ పోటీలలో మొదటి బహుమతి రూ.3 వేలు, రెండో బహుమతి రూ.2వేలు, మూడో బహుమతి వెయ్యి నిర్ణయించడం జరిగిందన్నారు. సెప్టెంబర్ 5వ తేదీ లోగా షార్ట్ ఫిల్మ్ గాని, ప్రైవేట్ పాటల వీడియో గాని, రీల్స్ గాని పంపాలని కోరారు. డీవీ రాజు, డాక్టర్ అశోక్ ఆనంద్ కొప్పుల పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై డీఆర్వోకు ఫిర్యాదు



గన్నవరం: మండలంలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలపై ప్రశ్నించిన తనపై బహిరంగ హెచ్చరికలు చేసిన గన్నవరం తహసీల్దారుపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు పత్రాన్ని డీఆర్వోకు అందజేసినట్లు ఆమె శనివార ఒక ప్రకటనలో తెలియజేశారు. తహసీల్దారు ఒక ఉద్యోగిగా కాకుండా రాజకీయ నాయకుడిగా వ్యవహరిస్తూ తనను అవమానపరిచే విధంగా పత్రిక ప్రకటనలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. తహసీల్దారుకు రాజకీయాలే ముఖ్యం అనుకుంటే ఉద్యోగానికి రాజీనామా చేసి ఎదైనా రాజకీయ పార్టీలో చేరి విమర్శలు చేసుకోవాలని హితవు పలికారు. అంతేకాని బాధ్యతాయుతమైన ఉద్యోగంలో ఉండి ఇటువంటి రాజకీయ పరమైన విమర్శలు చేయడం సరికాదన్నారు. మట్టి తవ్వకాలతో స్థానిక ఎమ్మెల్యేకు సంబంధం లేదని, 24 గంటల్లో తనకు సంజాయిషీ ఇవ్వాలని తహసీల్దారు ఆదేశించడం అన్యాయమన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలిగా తన హక్కులకు భంగం కలిగించిన తహసీల్దారుపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వృక్షాల నరికివేతపై ఫిర్యాదు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక విజయవాడ రోడ్డులోని ఐసీఎం జూబ్లీ ఎయిడెడ్ స్కూల్ ప్రాంగణంలో ఉన్న భారీ వృక్షాలను నరికి కలప తరలించటంపై పూర్వ విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయులు శనివారం ఆందోళన వ్యక్తం చేశారు. కోర్టు వివాదాల్లో ఉన్న ఈ పాఠశాల మూడేళ్లుగా కార్యకలాపాలు నిర్వహించటం లేదని, కొందరు ప్రైవేట్ వ్యక్తులు దశాబ్దాల వయస్సు కలిగిన భారీ వృక్షాలను నరికివేశారన్నారు. ప్రభుత్వం చెట్లను పెంచండి.. పర్యావరణాన్ని పరిరక్షించండని చెబుతుండగా ఇష్టారాజ్యంగా భారీ వృక్షాలను కూల్చివేయటంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశ్రాంత ఉపాధ్యాయుడు జాన్ మూడీ నేతృత్వంలో పూర్వ విద్యార్థులు, స్థానికులు బాపులపాడు తహసీల్దార్, ఎంఈవో, పంచాయతీ కార్యదర్శిలకు ఫిర్యాదు చేశామని తెలిపారు.